ప్రజాశక్తి

శనివారం 2 డిసెంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సమస్యలపై ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- పలు అంశాలపై ప్రజాప్రతినిధుల అసంతృప్తి
- నకిలీ విత్తనాలపైచర్యలు తీసుకోవాలి : లక్ష్మణరావు
- రహదారుల అధ్వానంపై శివకుమార్ ఆగ్రహం
- నీటి పరిశుభ్రతకు ప్రత్యేక కార్యచరణ : మంత్రి ధర్మాన
- డిఆర్‌సి సమావేశానికి పలువురు డుమ్మా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ (డిఆర్‌సి) సమావేశంలో పలు సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించగా ప్రత్తిపాడు, తాడికొండ, గుంటూరు తూర్పు, మంగళగిరి ఎమ్మెల్యేలు, పలువురు ఎమ్మెల్సీలు సమావేశానికి హాజరు కాలేదు. సమావేశం సాదాసీదాగా జరిగింది. కీలకమైన శాఖలపై సుదీర్ఘంగా చర్చించారు.

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణా ల్లో తాగునీటి శుద్ధికి సంబంధించిన ఫిల్టర్ బెడ్ల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి శుద్ధికి నిధులు ఖర్చు చేస్తున్నా ఆశించిన స్థాయిలో నాణ్యమైన నీరు సరఫరా జరగటం లేదన్నారు. పూర్తి స్థాయిలో నీటి శుద్ధికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖలు ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

కరువు మండలాలను ప్రకటించాలి : లక్ష్మణరావు

జిల్లాలో వర్షాభావం తీవ్రంగా ఉన్న మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మిర్చి పైరును మూడు కోతలు కోయాల్సి ఉందని, నీటి ఎద్దడితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మేడికొండూరు ప్రాంతంలో నకిలీ విత్తనాల వల్ల మిర్చి రైతులు నష్టోపోతున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల నుంచి తమకు ఫిర్యాదులు రాలేదని, రైతు సంఘాల నుంచి ఈ అంశంపై ఫిర్యాదులు వచ్చాయని, తగు చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారి తెలిపారు. కౌలు రైతులకు ▶ 2లో

ప్రవీణ్ ప్రకాష్ తీరు సరికాదు : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీరు సరికాదని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. పాఠశాలల తనిఖీల సందర్భంగా విద్యార్థుల ముందు ఉపాధ్యాయులను, ఉపాధ్యాయుల ముందు అధికారులను కించపర్చడం దారుణమన్నారు. విద్యార్థులకు సంబంధించిన దుస్తుల విషయంలో కూడా ఉపాధ్యాయులను నిందించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి చిన్న అంశాలకు ఛార్జ్ మెమోలు ఇవ్వడం సరికాదన్నారు. పాఠశాలలో విద్యా బోధనను పరిశీలించడంలో తప్పు లేదని, అయితే తనిఖీలు పేరుతో వేధించడం మంచిపద్ధతి కాదని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఎంపి ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి మాట్లా డుతూ ఉపాధ్యాయులు బాగా పనిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సిన్సియర్ అధికా రితో తనిఖీలు చేయిస్తోందన్నారు. దీనికి లక్ష్మణరావు స్పందిస్తూ తనిఖీలకు తాము వ్యతిరేకం కాదని, ఇష్టానుసారంగా వ్యవహ రించి మనస్తాపానికి గురి చేయడం తప్పని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల్లో 32 మందికి ఛార్జ్ మెమోలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులివ్వాలి

పలు సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ సిపిఎం గుంటూరు జిల్లా తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ తీర్మానించింది. శుక్రవారం బ్రాడిపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు పెట్రోలు, డీజిల్ వంట గ్యాస్ ధరలు పెరిగిపోయాయని, మరోవైపు ప్రజలకు సరిపడా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు రాజధాని నిర్మాణానికి, విశాఖ రైల్వేజోన్‌కు, కడప ఉక్కు నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసి అమలు జరపకుండా మాట తప్పి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. అయితే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు కేంద్రం విధానాలపై పోరాడకుండా రాజీధోరణిని అవలంబిస్తున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో దీర్ఘకాలంగా పోరాటాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఛానల్‌ను పొడిగిస్తే 5 మండలాలు 50 గ్రామాలలో సాగునీరు, తాగునీరు నిరాఘంటంగా అందుతాయని, ఆ ప్రాంతం వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించడానికి అవకాశముందని వివరించారు. గతంలో అధికార, ప్రతిపక్షాలు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక సంవత్సరాల నుండి ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల కుటుంబాలకు పట్టాలివ్వాలని కోరారు. పట్టణాలు, నగరాలలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రణాళికాబద్ధమైన డ్రెయినేజీ వ్యవస్థను రూపొందించాలన్నారు. పత్తి, మిర్చి, వరి పంటల వస్తున్నాని, వాటిని ప్రభుత్వం మద్దతు ధరకు కొనగోలు చేయాలడి కోరారు. మేడికొండూరు ▶ 2లో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.టి కృష్ణబాబు

ఆరోగ్యశ్రీపై ఇంటింటికీ అవగాహన

జిజిహెచ్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరించిన వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఆరోగ్యశ్రీపై ఇంటింటికీ వెళ్లి ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు ప్రజలకు వివరిస్తారని, నెలరోజులపాటు పెద్దఎత్తున సాగే ఈ కార్యక్రమం శుక్రవారం నుండి ప్రారంభమైందని వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దా తిరుమల కృష్ణబాబు తెలిపారు. ఈ మేరకు బ్రోచర్‌ను గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోని శుశృత హాల్లో ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో ▶ 2లో



విద్యార్థిని వివరాలు అడుగుతున్న వీసీ పి.రాజశేఖర్

వర్సిటీలో జాతీయస్థాయి ఫైన్ఆర్ట్స్ ప్రదర్శన

8లో

మహిళా చిరువ్యాపారికి కౌన్సిలర్ వేధింపులు

- అధికారులూ వత్తాసు పలుకుతున్నారని ఆవేదన
- నడిరోడ్డుపై మంటల్లో దూకేందుకు బాధితురాలి యత్నం

ప్రజాశక్తి-తెనాలి

చిరువ్యాపారిపై అధికార పార్టీ కౌన్సిలర్ వేధింపుల పర్వం కొనసాగడం, రోడ్డు వెంట తోపుడు బండిపై టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న కుటుంబంపై సాగుతున్న వేధింపులకు అధికారులు వంత పాడటంతో ఆ కుటుంబం రోడ్డుపై నిరసనకు దిగింది. ఒక దశలో బాధిత మహిళ మంటల్లో దూకే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. శివాజిచౌక్ కూడలిలో చిరువ్యాపారి నాదెండ్ల లక్ష్మిసుజాత కుటుంబం ఆక్రందనపై ఆమె వివరాల ప్రకారం...

మండలంలోని కోపల్లెకు చెందిన నాదెండ్ల లక్ష్మిసుజాత కుటుంబం దాదాపు 15 ఏళ్ల క్రితం తెనాలి పట్టణానికి వచ్చింది. శివాజి చౌక్ కూడలిలో భర్త, కుమారుడితో కలిసి తోపుడుబండిపై టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. వీరి సంపాదనే అధికార పార్టీ నాయకులకు కన్ను కుట్టిందో ఏమో కాని ఆమె టిఫిన్ బండిని అక్కడి నుంచి తీసేయాలని అధికార పార్టీకి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ తోట రఘురాం హుకుం జారీ చేశారు. అక్కడే 20 అడుగుల దూరంలోకి వారి వ్యాపారం మార్చుకోవాల్సిందిగా చెప్పారు. దీనికి ▶ 2లో



మంటల్లో దూకేందుకు యత్నిస్తున్న సుజాతన అడ్డుకుంటున్న భర్త

ఆరోగ్యశ్రీపై ఇంటింటికీ అవగాహన

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ఈ అవగాహనా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను ఎలా డౌన్లోడ్ చేసుకోవాలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరిస్తారని, దగ్గర్లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల వివరాలను అందిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లగానే ఎవరిని కలవాలి? ఏయే సేవలు అందుబాటులో ఉంటాయి? వంటి సమాచారాన్ని బ్రోచర్లలో పొందుపరచినట్లు చెప్పారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సమస్యలేమైనా ఎదురైతే ఎవరికి ఫిర్యాదు చెయ్యాలో బ్రోచర్లలో ఉంటుందన్నారు. అనంతరం జిజిహెచ్‌లోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఇదిలా ఉండగా ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఎయిడ్స్ బాధితులతో కృష్ణబాబు మాట్లాడారు. ఎటిఆర్ సెంటర్ గురించి వివరాలు అడిగారు. ఆయనవెంట ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఉన్నారు.

మహిళా చిరువ్యాపారికి కౌన్సిలర్ వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించిన లక్ష్మీసుజాత తన బండిని కొంచెం పక్కకు మార్చుకున్నారు. రెండ్రోజులు గడిచిందో లేదో..అక్కడి నుంచి కూడా తోపుడు బండిని తీసేయాలని కౌన్సిలర్ పట్టుబట్టారు. ఇదే పాయింట్‌లో నిలిపి ఉంచే బుర్రిపాలెం సర్వీస్ ఆటోలను అడ్డం పెట్టించి వ్యాపారారినికి విఘాతం కలిగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విషయం మాజీ కౌన్సిలర్ టి.రమేష్‌కు వెల్లడించేందుకు ఆమె కుమారుడు వెళితే.. చెప్పేది వినకపోగా దూషించి పంపించి వేశారని ఆరోపించారు. అది చాలదన్నట్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయటంతో వారు వచ్చి తోపుడు బండిని అమాంతం తీసుకెళ్లిపోయారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులతో పాటు అధికారులూ వేధిస్తున్నారని, విధిలేని పరిస్థితిలో భర్త, కుమారిడితో కలిసి శివాజిచౌక్‌లో కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. ఈలోగా పట్టణ టూటౌన్ ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది అక్కడికి చేరుకుని, సర్ది చెప్పే ప్రయత్నం చేయటంతో ఒక్కసారిగా రోడ్డుపై పెట్రోల్‌పోసి, నిప్పటించిన ఆమె దానిలో దూకే ప్రయత్నం చేశారు. ఆకస్మిక పరిణామంతో ఉలిక్కిపడిన పోలీసులు అప్రమత్తమై, ఆమెను అడ్డుకున్నారు. బాధితులను స్టేషన్‌కు తరలించారు. ఘటనపై వివరణ కోరేందుకు ఎస్ఐ రమేష్‌బాబును సంప్రదించగా వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదుపై సిఐ వివరిస్తారన్నారు. సిఐ వెంకటరావు వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మండలం శిరిపురంలో నకిలీ మిర్చి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు కంపెనీ యాజమాన్యం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ ను పూర్తి చేసి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని, మాస్టిన్ సామాజిక తరగతులకు కుల ధ్రువపత్రాల జారీలో తీవ్రజాప్యం వల్ల విద్యార్థులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చెప్పారు. ఎస్సీలకు శ్మశాన స్థలాలు చాలట్లేదని, జిల్లాలో అనేక చోట్ల వున్న స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, శ్మశాన స్థలాలు కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సమావేశంలో జిల్లా నాయకులు ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, కె.నళీనికాంత్, ఎం.రవి, ఎస్ఎస్.చెంగయ్య, బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, ఎల్.అరుణ, ఎంఎ.చిస్టీ పాల్గొన్నారు.

పాపిశెట్టిపాలెం అనన్య హాస్పిటల్ వైద్యశిబిరం

ప్రజాశక్తి-నకరికల్లు: నరసరావుపేట అనన్య హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నకరికల్లు మండలం కుంకలగుంట పంచాయతీ పరిధిలోని పాపిశెట్టిపాలెంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, ఎమ్‌డి ఫిజిషియన్, డయాబెటాలాజిస్ట్ డాక్టర్ విద్య ప్రజలకు వైద్య సేవలందించారు. బిపి, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, నెమ్ము, ఉబ్బసం, ఆయాసం, గుండె, జనరల్ వ్యాధులకు 150 మందికిపైగా పరీక్షలు చేసి ముందులు పంపిణీ చేశారు.

గుండె వ్యాధుల సత్వర చికిత్సకు కృషి

వర్క్‌షాపులో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల పరిధిలో ప్రజలు ఎవరైనా గుండె సంబంధిత సమస్యలపై బాధపడుతుంటే వారికి సత్వర చికిత్సలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు కోరారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో అత్యవసర గుండెసంబంధిత సమస్యలపై శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. గుండె నొప్పి లక్షణాలతో వచ్చే వారికి వెంటనే ఇసిజి తీసి థ్రాంబాలసిస్ చేయడమే ముఖ్యమైన ప్రక్రియని, ఇందులో ఎదురయ్యే సమస్యల్ని అధిగమించేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని పొందాలని సూచించారు. గుండె పోటు లక్షణాలు కనిపించే గ్రామీణులకు సకాలంలో చికిత్స అందించాలన్నదే స్టెమీని అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. జిల్లా కేంద్రంలోని హబ్‌తో సిహెచ్‌సిలోని స్పోక్ అనుసంధానం, థ్రాంబాలసిస్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై డాక్టర్లు, సిబ్బందికి కార్డియాలజిస్టులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. థ్రాంబాలసిస్‌ను సమర్థవంతంగా నిర్వహించగలిగితే గోల్డెన్ అవర్లో గుండెపోటు బాధితుల ప్రాణాల్ని కాపాడవచ్చాన్నారు. క్యాథ్ ల్యాబ్ లున్న వైజాగ్, గుంటూరు కర్నూలు జిల్లాల్లో స్టెమీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలనుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కార్డియాలజీ విభాగాల్లో పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బంది, పరికరాల ఏర్పాటును యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు. కర్నూలు, కాకినాడ, ఒంగోలు, శ్రీకాకుళం, నెల్లూరు, తిరుపతి, కడపలలో క్యాథ్ ల్యాబుల్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టెమీ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మునీశ్వర్‌రెడ్డి, డిఎంఇ డాక్టర్ నరసింహం, జిజిహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని, అన్ని గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి కోరారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసరావుపేటలోని పాలడుగు నాగయ్య చౌదరి - కొత్త రఘురామయ్య కళాశాల వద్ద నుండి పల్నాడు రోడ్డులోని మయూరి లాడ్జి సెంటర్ వరకు శుక్రవారం మెగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ రవి, డిఎల్ఎటిఒ మురళీకృష్ణ, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ప్రారంభించగా పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఫ్లాష్ మాబ్ ద్వారా హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో జరిగిన అవగాహన సమావేశంలో డిఎల్ఎటివో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ గతంతో పోలిస్తే హెచ్ఐవిపై అవగాహన ప్రజల్లో పెరిగిందన్నారు. ఎవరైనా హెచ్ఐవి బారిన పడితే వారికి ప్రభుత్వ పరంగా ఉచిత మందులతో పాటు, ఉచితంగా రక్త పరీక్షలు సైతం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎల్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్స్ గోపాలకృష్ణ మాట్లాడారు. ఎస్ఎస్ఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.గుప్తా, నరసరావుపేట గవర్నమెంట్



హాస్పిటల్ ఆర్ఎంఒ డాక్టర్ దయానిధి, చిలకలూరిపేట గవర్నమెంట్ హాస్పిటల్ ఆర్ఎంఒ డాక్టర్ అమృతవల్లి, నోడల్ ఆఫీసర్‌లు డాక్టర్ అంజని, డాక్టర్ హనుమకుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ లాజర్, హరికృష్ణ, జానకి, సాయినాథ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'వైసిపి అధికారంలోకి వస్తేనే పథకాలుంటాయి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అభివృద్ధి, సంక్షేమాలతో పాటు వ్యవసాయ రంగం, రైతుల అభ్యున్నతే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ 8వ వార్డులో రూ.25.09 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తేనే ఈ పథకాలు కొనసాగుతాయని చెప్పారు.

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం పేరూరిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రూపొందించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైసిపి జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. మధ్యవర్తులతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని, పేరూరిపాడులో గ్రామ సచివాలయం పరిధిలో 1221 మందికి రూ.21.63 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే వైసిపిని మళ్లీ గెలిపించాలని కోరారు.

సమస్యలపై ధ్వజం

(మొదటి పేజీ తరువాయి)

రుణాలు ఇవ్వడం లేదని లక్ష్మణరావు ప్రశ్నించారు. అత్యధిక వ్యాపారంచేసే ఎస్‌బిఐ పంట రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదన్నారు. ఎస్‌బిఐ గతంలో రూ.5 కోట్లు ఇచ్చిందని చెప్పారని, కానీ ఇప్పుడు ఒక్క రూపాయికూడా ఇవ్వలేదని రికార్డుల్లో తేటతెల్లమైందని అన్నారు. ఈ అంశంపై త్వరలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులన్నారు. గుంటూరు ఛానల్ భూసేకరణ పూర్తి చేసేందుకు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. గుంటూరు నగరంలో ఆర్‌యుబిలు, గోరంట్ల తాగునీటి పథకం ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు నీటిసమస్యను తక్షణం పరిష్కరించాలన్నారు. ఆత్మకూరు చెరువు నుంచి నీరివ్వాల్సి ఉన్నా రెండేళ్లుగా ఇవ్వలేకపోయారని అన్నారు. ఇందుకు అధికారులు సమాధానమిస్తూ అటవీశాఖ, జాతీయ రహదారి సంస్థ అధికారులకు లేఖ రాశామన్నారు. అనుమతి ఎప్పటికి వస్తుందని లక్ష్మణరావు ప్రశ్నించారు. గుంటూరులో తాగునీటి ఇబ్బందులను ప్రస్తావించారు.

టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారు? : ఎమ్మెల్యే గిరిధర్



గుంటూరులో టిడ్కో ఇళ్లు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే మద్దాలిగిరి ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లుగా మౌలిక సదుపాయాలు పూర్తి చేయలేకపోయారని అన్నారు. తాగునీటి పథకం ఎప్పటికి పూర్తి చేస్తారని ప్రశ్నించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్ ప్రస్తావించారు. రెండో దశ కాలనీల్లో ఇంత వరకు లెవలింగ్ కూడా చేయలేదన్నారు.

తలెత్తుకోలేకపోతున్నాం : ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిలో రహదారుల అధ్వానంగా ఉండటం వల్ల



తాను తలెత్తుకోలేకపోతున్నానని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తెనాలి - మంగళగిరి రోడ్డు తెనాలి - వివిఎస్ఆర్ కళాశాల నుంచి ఆటోనగర్ ఉన్న రోడ్లు అధ్వానంగా ఉండటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పలువురు చనిపోతున్నారని చెప్పారు. ఈ రోడ్డుపై కారులో వెళ్తూ కూడా తలెత్తుకోలేక తాను సెల్‌ఫోన్ చూసుకుంటున్నానని అన్నారు. ఈ అంశంపై ఎంపి ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ వివిఎస్ఆర్ కళాశాల నుంచి ఆటోనగర్ రోడ్డుకు ఖర్చయ్యే రూ.10 లక్షలు తాను ఎంపి ఫండ్స్ ద్వారా అందిస్తామని, వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌లో మురుగునీరు కలుస్తున్నందున ఛానల్‌కు సమాంతరంగా పైపులైన్లు ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని గ్రామాలకు, పట్టణాలకు తాగునీటి సరఫరా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ గుంటూరు నగరం ఎక్స్ టెన్షన్ ఏరియాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబీలు, ఆర్వోబీల నిర్మాణం వెంటనే ప్రారంభించాలన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంజనీర్లు ఎం.బుక్‌లు రికార్డు చేయాలన్నారు. అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ పేదలందరికి ఇళ్ల పథకంలో రెండవ ఫేజ్‌లో ఇళ్ళు మంజూరు చేయనున్న లే అవుట్లలోనూ మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు చేయాలని కోరారు. నాడు-నేడు ఫేజ్-2లో పాఠశాలల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ పంట రుణాలు మంజూరయ్యేలా బ్యాంకర్లతో నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రతి బ్యాంకుకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాల మంజురుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జెసి జి.రాజకుమారి మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి, అత్యవసర పనులకు మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఉపయోగిస్తామన్నారు.

మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ జిల్లాలో గత వ్యవసాయ సీజన్లో ఇబ్బందులేమీ లేకుండా అధిక దిగుబడులు సాధించారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం కోసం గుర్తించిన 2,500 మందికి 47 వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల ద్వారా ఇప్పటికే పూర్తి స్థాయిలో వైద్యంఅందించామని, మిగిలిన 200 మందికి 15 రోజులల్లో వైద్యసేవలను అందిస్తామని చెప్పారు. సాగునీరు ప్రాజెక్టుల క్రింద అప్పట్లో ఇరిగేషన్ కెనాల్స్ మాత్రమే ఏర్పాటు చేశారని, డ్రెయినేజీ కెనాల్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రస్తుతం జనాభా పెరగటం వలన వారు వినియోగించిన నీరు సాగునీటి కాల్వల్లో కలవటం వల్ల తాగునీరు కలుషితం అవుతుందన్నారు. రక్షిత నీటి సరఫరాతో సంబంధం ఉన్న ఆర్ డబ్ల్యు ఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్, పంచాయితీరాజ్ శాఖల సమన్వయంతో దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం సమగ్ర ప్రణాళికను రూపొందించి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు తీర్మానం చేసినట్టు తెలిపారు. ఆర్ అండ్ బి రహదారులు మరమ్మతులకు సంబంధించి ప్రజాప్రతినిధుల తెలిపిన అంశాలపై పనులు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డిసిఎంఎస్ఎస్ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్వారీలో గేదెలు కడిగేందుకు వెళ్లి యువకుడు మృతి



ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని సుద్దపల్లిలోని క్వారీలో గేదెలు కడిగేందుకని గురువారం వెళ్లిన వ్యక్తి ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివ రాలు.. రైతు కూలీగా జీవనం సాగిస్తున్న తోట శ్రీనివాసరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ఎదిగొచ్చిన కొడుకు మహేశ్ (22) వారి కుటుంబానికి ఆధారంగా ఉన్నాడు. ఇంటర్ మీడియట్ వరకు చదువుకుని ఆపే శాడు. గురువారం మధ్యాహ్నం తర్వాత గేదెలు ఇంటికి వచ్చాయి కానీ మహేశ్ మాత్రం రాలేదు. దీంతో, అనుమానం వచ్చి వారి కుటుంబసభ్యులు, స్థానికులు వెత కగా, చెప్పులు, సెల్ ఫోను క్వారీ గట్టుపై ఉండటం గమనించారు. అతను క్వారీ గుంటలో పడి ఉంటాడని అనుమానంతో శుక్రవారం గాలించారు. అతని మృతదేహాన్ని వెలికితీశారు. ఈ సమా చారం తెలుసుకున్న చేబ్రోలు ఎస్ ఐ కె .ఆనంద్, తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఘటనా స్థలానికి వెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాన్ని తర లించేందుకు నరేంద్ర తన వాహనాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ విపరీతమైన అక్రమ మైనింగే మహేశ్ ప్రాణాలు తీసిందని, అధిక లోతు ఉండటంవల్ల ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. అడ్డూఅదుపు లేని మట్టి తవ్వకాల కారణగా సుద్దపల్లి ప్రాంతంలో నిబంధనలకు మించి అధిక లోతుతో క్వారీలు ఏర్పడ్డాయని అన్నారు. ఎదిగొచ్చిన కొడుకును కోల్పోయిన వారి కుటుంబానికి ఆ నష్టాన్ని తీర్చేదెవరు? బాధిత కుటుంబాన్ని ఆదుకునేది ఎవరు? అని ప్రశ్నించారు. మైనింగ్ మాఫియాకు అమాయకులు బలి కావాల్సిందేనా అని సుద్దపల్లి ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న తకలెక్టర్ శివశకర్

మండలాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల ప్రత్యేక అధికారుల పరిలశీలనలో ఆయా మండలాలలో వచ్చిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో చర్చించారు. ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 13 లోగా పూర్తి చేయాలని, ఆయుష్మాన్ భారత్ ఆధార్ సీడింగ్ విద్యార్థులను నమోదు చేయాలని, బంగారు తల్లిలో బి మరియు సి గ్రేడ్ ల నుంచి ఏ గ్రేడ్ లోనికి, ఆడపిల్లలను ఎనీమియా నుంచి కాపాడాలని తల్లిదండ్రులకు వారానికి ఒకసారి అయినా కలిసి వివరించాలని చెప్పారు. మిషన్ శోభకృత్‌లో భాగంగా ఏర్పాటు చేసిన బోర్డులు ఎంపీడీవోలు బాగా పని చేశారని మెచ్చుకున్నారు. హౌసింగ్ రిజిస్ట్రేషన్ లో మార్పులు, బేస్ మేంట్ లెవల్ నుంచి తర్వాత స్టేజికి, లెవెల్ నుంచి బిల్డింగ్ మొత్తం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి 31 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో 14 వేల 921 ఉండగా, 12 వేలు టార్గెట్లను పూర్తిచేయాలని, 2వ విడతలో రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల గృహాలు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో భాగంగా ఇచ్చిన టార్గెట్లను మెగా కంప్లెసర్ డ్రైవ్ పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను, హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, విద్యాశాఖ అధికారి శామ్యూల్, డిఎంహెచ్ఒ రవి, ఐసిడిఎస్ పిడి అరుణ, డీఎస్ఓ పద్మశ్రీ, డి ఎం ఓ వరలక్ష్మి, కమాండ్ కంట్రోల్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ట్యాబ్ తీసుకురాలేదని విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

బెల్లంకొండ జెడ్‌పి హైస్కూల్‌లో ఘటన



చేతి గాయం చూపుతన్న విద్యార్థి ప్రతాప్

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని బెల్లం కొండ మండలం నందిరాజు పాలెంకు చెందిన విద్యార్థి మురికి పూడి ప్రతాప్ బెల్లం కొండ జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువు తున్నాడు. బోధన నిమి త్తం ప్రతాప్‌కు ట్యాబ్‌ను ప్రభుత్వం తరఫున అంద జేశారు. రోజు పాఠశాలకు ట్యాబ్‌తో సహా వచ్చే ప్రతాప్ శుక్రవారం దానిని తీసుకు రావడం మర్చిపోయాడు. దీంతో, ఆగ్రహించిన ఉపా ధ్యాయుడు ఆ విద్యార్థిని కర్రతో కొట్టి తీవ్రంగా గాయ పరిచాడని ప్రతాప్ తల్లిదండ్రులు చిట్టి బాబు, భారతి వాపో యారు. ఉపాధ్యాయుడుపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉపాధ్యా యుడిపై కఠిన చర్యలు తీసు కోవాలని మండల దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయమై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు శ్రీరామ్ రవికుమార్ వివరణ ఇస్తూ విద్యార్థినీ, విద్యార్థులందరిని వారి ట్యాబ్ లతో రావాలని గురువారం చెప్పామని అన్నారు. ప్రతాప్ తన ట్యాబ్ తీసుకు రాలేదని చెప్ప డంతో అతనిని మంద లిస్తూ ఒక దెబ్బ కొట్టానని అన్నారు. అయితే, అంతకు ముందే గాయమైన అతని చేతికి ఈ దెబ్బ తగిలిందని వివరిచారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్. శాంతి వివ రణ ఇస్తూ పాఠశాలలో ఇటు వంటి సం ఘటనలు పున రావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



షార్టుసర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని కొత్త రెడ్డిపాలెంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. దినసరి తాపీ కూలి పని చేసుకునే జీవనం సాగిస్తున్న డొనేపూడి సునీల్ రోజు మాదిరి శుక్రవారం కూడా కూలి పనికి వెళ్లాడు. ప్రమాద సమయంలో అతని భార్య భార్య ఝాన్సీ, కూతురు ఇంట్లో ఉన్నారు. ఇంటి పంచలో ఉన్న కరెంటు బోర్డు దగ్గర మంటలు చెలరేగి తాటాకులకు అంటుకున్నాయి. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను మాత్రం ఆమె బయటకు తీసుకు రాగలిగింది.తమ కుమార్తె పదవ తరగతి సర్టిఫికెట్లు, రేషన్, ఆధార్ కార్డులు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన సామాగ్రి, బట్టలు, మంచాలు, బీరువాలోని నగదు రూ. 40,000, బంగారం అన్నీ కాలిబూడిదయ్యాయి. తమను ప్రభుత్వం ఆదుకొని సహా యం చేయాలని బాధిత కుటుంబం కోరింది. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద తహశీల్దార్ సమక్షంలో గైర్హోయిన వెంకటసుబ్బయ్య, తొలి చూరి కొండలు 50 కిలోల బియ్యం, కిరాణా సరుకులు అందజేశారు.బాధిత కుటుంబానికి అందాల్సినవన్నీ సకాలంలో అందుతాయని, ఆ కుటుంబానికి అండగా ఉంటామని తహశీల్దార్ తెలిపారు.



బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న తహశీల్దార్, దాతలు



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 27,562
మిర్చి ఎగుమతి	: 30,248
మిర్చి నిల్వ	: 10,045

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,500
నెం.5	13,000 - 19,000
273	14,000 - 18,000
341	10,000 - 21,500
	నాన్ ఎసి
తేజ	9,000 - 23,500
బడిగి	9,500 - 24,500
దేవనూరు డీలక్స్	10,500 - 22,500
తాలుకాయలు	5,000 - 13,500
	ఎసి
334	9,000 - 21,200
నెం.5	15,000 - 16,000
341	10,000 - 18,200
తేజ	11,000 - 23,500
బడిగి	12,500 - 24,000
దేవనూరు డీలక్స్	15,000 -17,500
తాలుకాయలు	5,000 -12,000

భూ హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ఎపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన భూ హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్‌పల్నాడు జిల్లా అధ్యక్షులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్‌శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు . ఆయన మాట్లాడుతూ ఈ చట్టం అమలు అయితే భూమిపై రైతులు పూర్తి హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు . ఎటువంటి అనుభవం అర్హత లేని రాష్ట్రప్రభుత్వంచే నియమించిన బడిన ల్యాండ్ టైటిల్‌అధికారిని నమోదు చేసే హక్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ప్రజల స్థిరాస్థి విషయంలో వివాదాలు తలెత్తితే కక్షి దారులు సివిల్ కోర్టులను ఆశ్రయించి ఆ వివాదాలను పరిష్కరించుకుంటారని తెలిపారు. కొత్త చట్ట ప్రకారం కోర్టులకు సంబంధం లేకుండా జిల్లా , రాష్ట్ర స్థాయి ట్రైబ్యునల్ మాత్రమే ఆశ్రయించాలి అన్నారు. అక్కడ న్యాయం జరగని పక్షంలో మాత్రమే కక్షిదారులు హైకోర్టుకు వెళ్ళాలని నూతన చట్టం చెబుతోందని తెలిపారు. భూరైతుల హక్కులను కాలరాచే ఈ చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయని పక్షంలో ప్రజలు ఉద్యమాల బాట పట్టి ఈ ప్రభుత్వానికి బుద్దిచెబుతారని హెచ్చరించారు.

సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-పెదకూరపాడు



పెదకూరపాడు మండలంలోని పాటిబండ్లలో శుక్రవారం వైసిపి జెండాను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఆ గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాలు అందించిన వివరాలతో కూడిన బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెదకూరపాడు మండల ఎంపిపి బెల్లంకొండ మీరయ్య, పెదకూరపాడు వైస్ ఎంపిపి బాషా, పెదకూరపాడు మండల పార్టీ కన్వీనర్ షరీఫ్ , ఇతర పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న ఎంపిటిసి కాంతారావు

మోడల్ బయో టాయిలెట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

వెల్దుర్తి మండలంలోని మండాది జెడ్‌పి పాఠశాలలో వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్మించిన బయో టాయిలెట్‌ను ఎంపిటిసి కాంతారావు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ సుశీల శుక్రవారం ప్రారంభించారు. బ్లాక్ కో-ఆర్డినేటర్ మాడెబోయిన గురుప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానంతో ఈ మోడల్ బయో టాయిలెట్‌ను నిర్మించినట్లు చెప్పారు. మండలంలోనే ఇది మొదటిదన్నారు. ఇది ఎప్పటికప్పుడు శుభ్రమవుతుందని, నిర్మాణం మూడు నాలుగు రోజుల్లోనే పూర్తవుతుందని వివరించారు. కార్యక్రమంలో సిఎఫ్‌లు రాజశ్రీ, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ బ్యాడ్మింటన్ పోటీలకు ధనలక్ష్మి విద్యార్థులు

ప్రజాశక్తి-ఈపూరు






మన భంజన్ నాయక్, ప్రతీక్ కుమార్ సింగ్‌దేవ్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో మండలంలోని ఎ.ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు మనభంజన్ నాయక్, ప్రతీక్ కుమార్ సింగ్ దేవ్ విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.వెంకటరావు తెలిపారు. వీరిద్దరూ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యారని, ఈనెలలో జరిగే పోటీల్లో వీరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన వారిని కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఎం.రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, ఎం.దాస్, సిహెచ్ అరవింద్ అభినందించారు.

ఓటు హక్కు సద్వినియోగమే ప్రజాస్వామ్యానికి రక్ష

ప్రజాశక్తి - మాచర్ల

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఇండియా అని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపైనా ఉందని తహశీల్దార్ మహ్మద్ హుస్సేన్ అన్నారు. స్థానిక చక్రధర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన స్వీప్ కార్యక్రమానికి తహశీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, విద్యావంతలపై ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని, మిగతావారిలోనూ వారు చైతన్యం నింపాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



శనగ వైపు రైతు చూపు

గతేడాదితో పోలిస్తే వెయ్యి ఎకరాల్లో అధికంగా సాగు



ప్రజాశక్తి - చిలకలూరిపేట

సాగు నీటి కరువు నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి మళ్లింది. నీటి అవసరం తక్కువగా ఉండే, మంచు చెమ్మతో బతగ్గలిగే పంటల సాగును రైతులు పెంచారు. ఈ కోవలోనే శనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. చిలకలూరిపేట మండలంలో 17 వేల ఎకరాల వరకూ సాగు భూమి ఉండగా గతేడాది 2 వేల ఎకరాలకుపైగా ఎర్ర (ఉప్పు) శనగ పంటను సాగు చేశారు. ఈ ఏడాది మరో వెయ్యి ఎకరాల వరకూ ఈ సాగు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ పంటను కొద్ది మొత్తంలో అయినా సాగు చేస్తుండగా పసుమర్రులో అధికంగా సాగవుతోంది.

సాధారణంగా ప్రతి సీజన్‌లోనూ నవంబర్ చివరి వారం నుండి డిసెంబర్ మొదటి వారంలోగా శనగ పంట సాగు చేస్తుంటారు. మూడు నెలల్లో పంట చేతికొస్తుంది. శనగ సాగును ప్రారంభించేలోగా మొక్కజొన్న, నూగులు, జ్యూట్ తదితర పంటలు వేసుకోవడానికి అవకాశం ఉన్నా ఎక్కువ మంది రైతులు సాగు చేయడం లేదు. రైతులైనా, కౌలురైతు లైనా



ఎరువులును దుక్కిలో ట్రాక్టర్ ద్వారా చల్లుతున్న రైతు దానం వెంకట్రావు

తమ పొలాలను ఖాళీగానే పెడుతున్నారు. నీటి ఎద్దడి ఎందుకు ఒక కారణంగా కాగా వారిని ఇతర పంటల సాగుకు ప్రోత్సహించడంలో అధికారుల వైఫల్యం మరో కారణంగా తెలుస్తోంది.

గతేడాది శనగ పంట ఎకరాకు 8 నుండి 12 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది. గతేడాది మద్దతు ధర రూ.5,630 ఉండగా ఈ ఏడాది రూ.6,200 వరకూ ఉంది.

అయితే గతేడాది ప్రైవేటు మార్కెట్‌లో రూ.ఐదారు వేల వరకూ ధర పలికింది. ఎకరా శనగ పంట సాగుకు 40 కిలోల విత్తనాలు అవసరం. ప్రస్తుతం కిలో విత్తనాల ధర బహిరంగ మార్కెట్‌లో రూ.80-90 వరకూ ఉండగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.48.60కు అందిస్తున్నారు. విత్తన ఖర్చు మొత్తంగా రూ.2 వేల నుండి రూ.3600 వరకూ ఉంటుంది. దుక్కిలో రెండు ఎరువుల బస్తాలు వేయాల్సి ఉంటుంది. అవసరం అనుకుంటే తేలికపాటి పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చు. కౌలు రూ.10 వేలుంటుంది. మొత్తంగా రూ.17 వేల వరకూ పెట్టుబడి ఖర్చులవుతాయి. అనుకున్న విధంగా పంట పండితే ఖర్చులుపోను ఎకరాకు ఖర్చులు పోను రూ.40 వేలు మిగిలే అవకాశం ఉంటుంది. పంటను చిలకలూరిపేటలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తారు.

అయితే పత్తి, మిర్చి పంటలు సాగు చేసి, అన్నీ అనుకూలిస్తే ఎక్కువ మొత్తంలో రాబడులు ఉంటాయనే ఉద్దేశంతో శనగ తరహా ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు దూరంగా ఉంటున్నారనే వాదనా ఉంది. ఈ నేపథ్యంలో వారిలో అవగాహన పెంచి తక్కువ ఖర్చుతో మంచి రాబడులు పొందే పంటల సాగుకు ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

వచ్చేనెల 1 నుండి ఆరోగ్య సురక్ష రెండో విడత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని వచ్చేనెల 1వ తేదీ నుండి నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. దీనిపై ఈనెల ఒకటి నుండే ఎఎన్‌ఎంలు ప్రజల ఇళ్లకు వెళ్లి బ్రోచర్లను అందించాలని చెప్పారు. ఈ మేరకు బ్రోచర్లను జెసి తన ఛాంబర్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖాధికాధికారి డాక్టర్ రవి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ విజయ్ ప్రకాష్, టీమ్ లీడర్ కె.సంపత్ కుమార్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై ఎఎన్‌ఎం (సచివాలయ ఆరోగ్య మిత్రాలు)లకు ఇప్పటికే శిక్షణిచ్చామని, ఎఎన్‌ఎంలు వారి గ్రామాల్లోని ప్రతి ఇంటికి ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను అందించటంతో సరిపెట్టకుండా అందులోని ప్రతి విషయాన్నీ ప్రజలకు అర్థవంతంగా వివరించాలని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం యొక్క లక్ష్యాల్ని, ప్రయోజనాల్ని తెలపడంతోపాటు ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరి ఫోన్‌లో అయినా ఇన్‌స్టాల్ చేసి, లాగిన్ చేయించాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ యాప్‌లో ఉన్న ప్రతి ఆప్షన్‌ను ప్రజలకు వివరించాలని చెప్పారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రవి తదితరులు

అర్హులైన రైతులందరికీ జలకళ

9 మందికి యూనిట్లను పంపిణీ చేసిన మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అర్హులైన రైతులందరికీ వైఎస్సార్ జళకళ పథకాన్ని అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఈ మేరకు మంజూరైన వారిలో 9 మంది రైతులకు పంపుసెట్లను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయానికి అండగా నిలిచేందుకు జలకళ పథకం ఎంత దోహదపడుతోందని అన్నారు. మండల పరిధిలో 160 మందికి ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు పరిపాలన అనుమతులు లభించగా 34 మందికి బోర్వెల్స్ చేయించామని తెలిపారు. వీరిలో 19 మంది రైతులకు విద్యుత్ సరఫరా కూడా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమములో రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



రైతులకు పంపుసెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి

ఫిర్యాదుతో రేషన్ బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి : మండల కేంద్రమైన అమరావతిలోని విజయసాగర్ కాలనీలో రెండు నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని స్పందన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి విఆర్ఒ సురేష్ ద్వారా విజయసాగర్ కాలనీలో బియ్యాన్ని శుక్రవారం అందించారు. ఇందుకుగాను అధికారులకు సూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినెలా అందించాలని స్థానికులు కోరారు.



జలకళ బోర్లకు నెలలోగా విద్యుత్

ప్రజాశక్తి-అచ్చంపేట

మండల కేంద్రమైన అచ్చంపేటలోని జెడ్‌పి పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన పనులను పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి శుక్రవారం పరిశీలించారు తరగతి గదుల నిర్మాణంతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం కలపాలెం గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని, తాళ్లచెరువు, పెదపాలెం గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాల కల్పనను పరిశీలించారు. జలకళ ద్వారా మంజూరైన బోర్లుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదనే అంశంపై విలేకర్లు ప్రశ్నించగా కర్నూలు, అనంతపురం జిల్లాల్లోనూ ఈ సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, నెలరోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు. రాష్ట్రంలో 14 వేల సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. అనంతరం సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఎంపిడిఒ శివ సుబ్రహ్మణ్యం, ఎంఇఒ శ్రీనివాసరావు, ఎంపిపి భూక్య రజినిబాయ్ కృష్ణ నాయక్, వైస్‌ఎంపిపి జి.నరసింహారెడ్డి, ఎన్.చంద్రబాబు, సర్పంచ్ వీరబాబు పాల్గొన్నారు

డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి





ఎరుకలపూడిలో కోతకు సిద్ధమైన వరి



కరెవరం వద్ద యంత్రాలతో వరి కోతలు

వాయుగుండం హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

యంత్రాలతో హడావిడిగా వరికోతలు

ప్రజాశక్తి - తెనాలి :బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందళనలో ఉన్నారు. ముందస్తు వెద పద్ధతిలో సాగు చేసిన వరి కోతకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో హడావుడిగా యంత్రాలతో వరి కోతలకు శ్రీకారం చుట్టారు. యంత్రాల ద్వారా సాగే వరి కోతలో, కోత సమయంలోనే ధాన్యం కూడా వినబడుతుంది. అవకాశం ఉన్న రైతులు వాటిని ఆరబోసి విక్రయించే ప్రయత్నంలో ఉన్నారు. వాస్తవానికి యంత్రాలతో వరి కోత, నూర్పిడితో రైతులు వరి గడ్డిని దాదాపుగా నష్టపోయే ప్రమాదం ఉంది. అయినప్పటికీ తుపాను సూచనల ప్రభావంతో పూర్తిగా నష్టపోవడం కంటే కొంతైనా పంటను దక్కించే ప్రయత్నంలో రైతులు తిప్పలు పడు తున్నారు. బుధ, గురువారాల్లోనే కొంతమేర వరి కోత, నూర్పిడి కూడా సాగింది. వాయుగుండం తుపానుగా మారే ప్రమాదం ఉందన్న సూచనలతో శుక్రవారం రైతులు యంత్రాలతో వరి కోతలు ముమ్మరం చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి వాతావరణ ప్రతికూల పరిస్థితులు రైతులకు ప్రాణ సంకటంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నరసరావుపేటలో జెసికి వినతి పత్రం ఇస్తున్న పల్నాడు జిల్లా యుటిఎఫ్ నాయకులు



గుంటూరులో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న గుంటూరు జిల్లా యుటిఎఫ్ నాయకులు

మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు, పల్నాడు జిల్లాలో అధికారులకు వినతిపత్రాలిచ్చి యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

మున్సిపల్ టీచర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ టీచర్ల సమస్యలపై యుటిఎఫ్ నాయకులు గుంటూరు జిల్లాలో కలెక్టర్‌కు పల్నాడు జిల్లాలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ కు, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ శామ్యూల్‌కు ప్రాతినిధ్యం చేశారు.

గుంటూరులో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, బదిలీలు నిర్వహించాలని కోరారు. మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు నిలిచి పోయాయని, వాటిని పరిష్కరించటానికి ఉన్న అడ్డంకులు తొలగించాలని కోరారు. మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ ఖాతాలను ప్రారంభించి, ప్రీమియం ఖాతాలలో సర్దుబాటు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణ కోసం కొత్త ఎంఇఒ పోస్టు ఏర్పాటు చేసి, మున్సిపల్ టీచర్ల ద్వారా నింపాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో ఖాళీలను నింపాలని పోస్టులు అప్‌గ్రేడేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సబ్ కమిటీ సభ్యులు కె.ప్రభూజీ, ఎం.కోటిరెడ్డి, బి.ప్రసాద్, పి.కోటిసుందరరావు, బి.నాగేంద్రబాబు, ఎన్.శివరామిరెడ్డి, ఎం.చిన్నయ్య, శివన్నారాయణ, ఎన్.ధనలక్ష్మి, షబీర్ హుస్సేన్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటలో పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి విజయసారధి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల సరిష్కారం కోసం యూటిఎఫ్ దశలవారి పోరాటాలకు కార్యాచరణ రూపొందించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్, బదిలీలు, అప్గ్రేడ్డేషన్ పి.ఎఫ్ అకౌంట్స్, డివైఈఓ పోస్టులు, అర్బన్ ఎంఈఓ పోస్టులు మున్సిపల్ ఉపాధ్యాయులు కేటాయించడం వంటి డిమాండ్లు పరిష్కరించాలని 5న మున్సిపల్ కేంద్రాలలో నిరసన, 12,13 తేదీలలో అన్ని మున్సిపాలిటీలలో ప్రచారం, 15 న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 20 నుండి 23 వ తేదీ వరకు జిల్లా సదస్సులు చేపడతామన్నారు. నాడు-నేడులో పాఠశాలల తరగతి గదులు పూర్తి స్థాయిలో పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ బిల్లులు ప్రభుత్వం చెల్లించక పోవడంతో విద్యుత్ శాఖ అధికారుల నుంచి ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగిపోయిందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధ్యాయులే విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. పాఠశాలల్లో పిల్లలు సంఖ్యకు అనుగుణంగా సబ్జెక్టు టీచర్ల కొత్త తగ్గించాలని వెంటనే పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ పోరాటాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్ర మంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులు ఎం.మోహనరావు, కోశాధికారి జె.వాల్యా నాయక్, కార్యదర్శులు కె.తిరుపతి స్వామి, కె.ఉషాశౌరి రాణి, టి.వెంకటేశ్వర్లు, జాన్ వి రాజ్ కుమార్, ఆడిట్ కమిటి గొడుగు ఆంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్లు షేక్ ఖాశిం పీరా, ఎన్.సుందరరావు, టి.అరుణ్ కుమార్, కె.వెంకటేశ్వరరావు, ఓ సాంబయ్య, వై. శ్రీనివాసరావు, చంద్ర శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.



పల్నాడుజిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ కు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

రేపు రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న రైతాంగ సమస్యల సాధన కోసం , డిసెంబర్ 3 ఆదివారం ఉదయం10 గంటలకు, వడ్డేశ్వరం లోని కేబీ భవన్ జరుగు గుంటూరు జిల్లా రైతు సంఘం ప్లీనంను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండ లో రైతులతో కలిసి అయిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని అన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణ మాఫీని రైతులకు వెంటనే అమలు చేయాలని అన్నారు. అదే విధంగా రైతుల పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి, సీటు ప్లస్, 50 శాతం వరకు చట్టం చేయాలని, రైతాంగాన్ని నష్టపరిచే స్మార్ట్ మీటర్లు ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందని ఆయన తెలిపారు. గుంటూరు ఛానల్ కు నిధులు కేటాయించాలని, కొండవీటి వాగులో తూటి కాడ, గుర్రపు డెక్క తొలగించాలన్నారు. అంతేకాకుండా చిర్రావూరు గ్రామంలో ఉన్న పశువుల ఆసుపత్రికి పశు వైద్యున్ని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా రాజధాని రైతులకు, అసైన్డ్ రైతులకు వెంటనే కౌలు చెల్లించాలని అన్నారు. తెనాలి ఆధునీకరణ పనులు పూర్తి చేసి, లాకులకు షట్టర్స్ రిపేర్ చేయించాలన్నారు.తదితర డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్లీనం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రైతు నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, అమ్మిశెట్టి రంగారావు, బి గోపాల రెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ మాట్లాడారు. ప్రతి ఓటు విలువైనది అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేద్దాం మంచి సమాజాన్ని నిర్మించుకుందాం అని విద్యార్థులకు తెలిపారు. యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.జనవరి 1 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదును బిఎల్ఓ దగ్గర లేదా ఆన్లైన్ లో వెబ్సైట్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని పొందవచ్చు అని తెలిపారు. మరింత సమాచారం మరియు సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1950 కి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు అని అన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి, వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, మండల విద్యాశాఖ అధికారి ఆర్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు బిఎల్వోలు పాల్గొన్నారు.

నకిలీ మిర్చి విత్తన పైరును పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలోని యూఎస్ అగ్రి సీడ్స్ ఎస్ డబ్ల్యూ 450 అనే నకిలీ మిర్చి విత్తనం సాగు చేశారు. ఆ విత్తనం వేయటం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నకిలీ మిర్చి విత్తన వ్యవహారాన్ని బాధిత రైతులు, రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ అధికారి శైలజకు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన అధికారులు శుక్రవారం గ్రామంలోని ఆ విత్తనం వేసిన సాగుచేసిన పొలంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నకిలీ పంట పొలాలను పరిశీలించిన వాస్తవ పరిస్థితులపై నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని శైలజ తెలిపారు. రైతులకు న్యాయం జరిగేటట్లు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది మురళి, సంధ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.



బిజెపి, వైసిపి ప్రభుత్వాల విధానాలు ప్రతిఘటించాలి

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం.రామ కృష్ణ పిలుపునిచ్చారు. పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా 23వ మహాసభ శుక్రవారం స్థానిక అరండల్ పేటలోని ఆర్య సమాజ్ భవనంలో జరిగింది.సభలో రామకష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని మనువాద భావాజలంతో నింపడానికి నూతన జాతీయ విద్యావిధానం తెచ్చిందని విమర్శించారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, మొఘలు, భగత్‌సింగ్, పీరియాడిక్ టేబుల్ వంటి చారిత్రక పాఠ్యంశాలను తొలగించి, రామాయణం, మహాభారతం వంటి పుక్కిట పురాణాలను విద్యార్థుల మెదళ్ళలోకి చొప్పించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. యూనివర్సిటీలను సంక్షోభంలోకి నెడుతున్నారు.బిజెపి ప్రభుత్వ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయన్నారు. మోదీ అడుగుజాడల్లో రాష్ట్రంలో జగన్ సర్కార్ నడుస్తున్నదని, పాఠశాలలను, టీచర్ పోస్టులను కుదిస్తున్నారని అన్నారు. పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ దూరం చేసేందుకు జిఒ 77 తెచ్చారన్నారు. సభలో ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ప్రసాద్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు, పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు విష్ణు ప్రసంగించారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులుగా ఎం. సాహితీ, జిల్లా కార్యదర్శిగా పి. ప్రసన్నతో పాటు తొమ్మిది మందితో జిల్లా నూతన కార్యావర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాగులూరి ఫౌండేషన్ సభ్యులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వద్దులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని మొల్ల మాంబ వృద్ధుల ఆశ్రమంలో 30 మంది అనాథ వృద్ధులకు మాగులూరి ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఎన్నారై మాగులూరి భాను ప్రసాద్ సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ సభ్యులు కుంచనుపల్లి కిరణ్ కుమార్, మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాద్ లు తెలిపారు.



ఎపి పిటిడిలో సంఘానికి గుర్తింపు

ప్రజాశక్తి - వినుకొండ

ది పిటిడి వైయస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రిజిస్టర్ నెంబర్ 46/2020 ఎపి పిటిడి లోని సంఘానికి రాష్ట్ర గుర్తింపును ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా వైయస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా భద్రయ్య కు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టిసి డిపోలో శుక్రవారం అసోసియేషన్ గౌరవాధ్యక్షురాలు, కౌన్సిలర్ షకీలా , డిపో మేనేజర్ బాణావత్ కోటేశ్వర నాయక్ కు గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భగా అసోసియేషన్ కమిటీని పరిచయం చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో వినుకొండ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు దుబ్బల నాగరాజు కుమార్, కార్యదర్శి ఇనగంటి ఆంజనేయులు, ఎస్.కె ముజీర్, వై.శేషయ్య, మరియన్న, ఎంఇ కొండలు, కోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బాబు, అంకయ్య, వెంకటరెడ్డి, సుందర రెడ్డి పాల్గొన్నారు.

నూతన భవన ఏర్పాటుపై ప్రతిపాదనలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పురుషోత్తపట్నంలోని గిరిజన గురుకుల పాఠశాలను పల్నాడు జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి లోతేటి వరలక్ష్మి, తహశీల్దార్ జి.సుజాత సందర్శించి నూతన భవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు శుక్రవారం నాడు పంపించారని గిరిజన సంఘా ల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ అన్నారు. పండరీ పురంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవార జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండలో వెలటూరు రోడ్డు లోని గల హనుమాన్ నగర్ రెండవ లైన్లో రూ.1.40 లక్షలతో అదనపు తరగతి గదులను గురువారం వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కలెక్టర్ శివశంకర్ ప్రారం భోత్సవం చేయడంప సంతోష కరమన్నారు. వ్యవసాయం చేసుకునేందుకు ఎస్టిలకు వినుకొండలో 27.37 సెంట్ల వ్యవసాయ భూమిని ఇచ్చినట్లు చెప్పారు. ఈ సంద ర్భంగా వారికి శ్రీను నాయక్ తన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు బి. చిన్నా నాయక్, పట్టణ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలకు కారణాలు పరిశీలించాలి

పలు అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించిన జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ శుక్రవారం రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల అధికారులు సివిల్ సప్లై అధికారులతో కలెక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో భాగంగా ఆన్లైన్ సర్వీసెస్ , పౌరసరఫరాల శాఖ ద్వారా మొబైల్ డిస్పర్స్ యూనిట్ సేవలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రైతుల ఆత్మహత్యలు వివరాలను సేక రించాలని, కారణాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. భూముల రీసెర్వేపై సమీక్షిస్తూ మ్యుటేషన్ ఫర్ ట్రాన్స్ఫర్ మరియు కరెక్షన్స్ని వివరాలు సేకరించారు. తిరస్కరణకు గల కారణాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు తిరస్కరణకు గల కారణాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. చుక్కల భూములు ,22ఎ అడంగల్ భూములపై వివరాలు సేకరించారు. వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి భూముల సేకరణకు తీసుకున్న భూములు విషయంలో ఆ భూములు నగదు చెల్లింపు తర్వాత ప్రభుత్వానికి చెందుతాయని సూచించారు. అదేవిధంగా సాదా బైనమా పై సమీక్షించారు. భూముల మార్పులపై వివరాలు సేకరించారు. నీటి పన్నులను సకాలంలో కలెక్ట్ చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆటోమిటేషన్ ఫెసిలిటీ పై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీశేసిరెడ్డి, మండల రెవెన్యూ అధికారి రమణ నాయక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనిల్ పాల్గొన్నారు.

'ఓటమి భయంతో టిడిపి ఓట్లు తొలగిస్తున్న ఎమ్మెల్యే'

ప్రజాశక్తి - వినుకొండ

ఓటమి భయంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బిఎల్ఓ లను, ఎన్నికల అధికారులను ఒత్తిళ్లకు గురిచేసి టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగిస్తున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి ఎల్ వోలను, అధికారులను తన ఇంటికి, కళ్యాణ మండపానికి పిలిపించుకొని తమకు అనుకూలంగా పనిచేయకపోతే బదిలీ చేయిస్తానని బెదిరిస్తూ టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగించి, దొంగ ఓట్లు చేర్చేందుకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో స్థానికంగా నివాసముంటున్న సుమారు 6,000 మందికి ఓట్లు తొలగించేందుకు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఒక వ్యక్తి ఓట్ల తొలగింపునకు 5 దరఖాస్తులు మించి పెట్టకూడదని నిబంధన ఉన్నప్ప టికీ వైసిపి నాయకులు వందల సంఖ్యలో ఫారం-7 దరఖాస్తు చేస్తుంటే చర్యలు తీసుకోకుండా అధికారులు వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరులో సర్పంచ్ మహిళా చిన్న వీరయ్య వ్యక్తి పేరు పై 350 ఓట్లు తొలగించేందుకు ఫారం -7 దరఖాస్తు చేశారని ఆధారాలతో వివరించారు. శావల్యాపురం మండలంలోని అనేక గ్రామాల్లో టిడిపి సానుభూతి పరుల ఓట్లు తొలగించారన్నారు. ఓట్ల తొలగింపు పై అధికారిని నిలదీస్తే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైసిపి నాయకులు అధికారులకు కూడా కులాన్ని ఆపాదించడం దుర్మార్గమైన చర్య అన్నారు.

చికిత్స పొందుతున్న చిన్నారులకు పరామర్శ

కరెంటు తీగల తగిలి వారి శరీరం కాలిపోవడంతో గుంటూరు ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు చిన్నారులను పల్నాడు జిల్లా



టిడిపి అధ్య క్షులు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు శుక్రవారం పరామర్శించారు. పన్నెండు రోజుల క్రితం వినుకొండలోని రెడ్డినగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు రిషిత, పావన, శ్రీ హర్షిత లు డాబాపై ఆడుకుంటుండగా మెయిన్ లైన్ కరెంట్ తీగలు తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. చిన్నారుల వైద్యం కోసం రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



రైతులకు పంపుసెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

అర్హులైన రైతులందరికీ 'జలకళ'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అర్హులైన రైతులందరికీ వైయస్సార్ జలకళ పథకాన్ని అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో వైయస్సార్ జలకళ పథకం కింద రైతులకు పంపుసెట్లు మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ వ్యవ సాయానికి అండగా నిలిచేందుకు జలకళ పథకం ఎంత దోహదపడుతోందని అన్నారు. మండల పరిధిలో 160 మందికి ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు పరిపాలన అను మతులు లభించగా అందులో 34 మందికి బోర్వెల్స్ చేయించడం జరిగిందన్నారు. వీరిలో 19 మంది రైతులకు విద్యుత్ సరఫరా కూడా ఏర్పాటు చేశామన్నారు. మొదటి విడతగా 9 మందికి పంపుసెట్లు మంత్రి అంబటి రాంబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.



భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను పంచుతున్న డాక్టర్ చదలవాడ

'వైసిపి పాలనలో ఇంటింటా ఆవేదనే'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


వైసిపి పాలనలో ఏ ఇంట చూసినా ఆవేదనే కనబడుతోందని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్ ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 27 వార్డులో టిడిపి - జనసేన అజెండాలోని భవిష్యత్తుకు గ్యారంటీ పథకంపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్‌కాలేజీలో హెల్ప్ పౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సభను నిర్వహించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు అధ్యక్షత వహించారు . ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో శ్రీలత మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, కొన్ని అజ్రాగత్తల వలన ఇది వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ఎయిడ్స్ నాలుగు రూపాల్లో మనిషిలోకి ప్రవేశిస్తుందని అన్నారు.

సురక్షితం కానీ లైంగిక సంబంధ ద్వారా, పరీక్షలు చేయని రక్త మార్పిడి కారణంగా, కలుషితమైన నీడిల్స్ వాడకం వలన ఈ వ్యాధి వ్యాప్తి చెందు తుందని చెప్పారు. ఈ దేశ సంపద యువతేనని, ఎయిడ్స్ పట్ల పూర్తి అవ గాహన కల్గి ఉండాలని సూచించారు. మానవాళి మనుగడకు ప్రశ్నార్థకగా మారిన ఎయిడ్స్‌పై ఎన్నో అపోహలు , అనుమానాలు ప్రజల్లో ఉన్నాయన్నారు. దీనిపై ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో 'అసమానతలను నిర్మూలిద్దాం, ఎయిడ్స్ ను అంతమొందిద్దాం' అనే నినాదంతో ప్రచారం నిర్వహించి యువతను చైతన్యం పరుస్తోందని అన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో హెల్ప్ పౌండేషన్ అధ్యక్షులు కంచెర్ల బుల్లిబాబు, అదనపు సిడిపివో సంతోషి కుమారి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సిడిపివో శ్రీలత

అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో ని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ వై.లక్ష్మి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే,ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిపట్ల ప్రజలు సేవా భావం కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు కమలాకర్, రాంబాబు,శ్రీనాథ్, కాంత్,మాధవి, సునీత,హేమలత, ఐ సి టి సి కౌన్సిలర్ నాగరాజు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ఈపూరులో అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు

స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024కు సంబంధించి అందించిన క్లైయిమ్‌లు 15 రోజుల లక్ష్యంగా పెట్టుకొని పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఈఆర్వోలు, ఏఈఆర్వోలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు.శుక్రవారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, నగర కమీషనర్ కీర్తి చేకూరి, డీఆర్ఓ కె.చంద్రశేఖరరావుతో కలసి స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 6, 7, 8లకు సంబంధించి క్లెయిమ్స్ వెరిఫికేషన్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఓటరు కార్డు వెరిఫికేషన్ కు వెళ్లినప్పుడు బీఎల్వోలు ఆ ఇంటిలోని కుటుంబ సభ్యుల ఓటరు కార్డులకు సంబంధించి అన్ని విషయాలను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి వివరాలు నమోదు చేసేలా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లజాబితా పై తెలిపిన అభ్యంతరాలు, ఇతర పిర్యాదులపై ఎప్పటికప్పుడు విచారణ చేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫార్మేట్ లో ఐదు రోజుల్లో వివరాలు రాజకీయ పార్టీలకు అందించటంతో పాటు, తీసుకున్న చర్యలపైన నివేదిక అందించాలన్నారు. సమావేశంలో ఈఆర్వోలు నగరపాలక సంస్థ అదనపుకమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఆర్డీవో పి.శ్రీఖర్ , డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఏఈఆర్వోలు మల్లేశ్వరి, ఫణీంద్రబాబు, శ్రీకాంత్, నగేష్, రాంప్రసాదు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

12వ రోజుకు గుంటూరు ఛానల్ దీక్షలు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో పెదనందిపాడు లో చేపట్టిన రైతుల నిరసన దీక్ష శుక్రవారంతో 12వ రోజుకు చేరుకుంది. దీక్షలను సిపిఐ ఎంఎల్ నాయకులు కొల్లిపర వెంకటేశ్వరరావు ప్రారంభించి ప్రసంగించారు. ఇప్పటికైనా గుంటూరు ఛానల్ పొడిగింపుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్ష లో నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్‌రావు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, పెదనందిపాడు మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజ కుమారి, రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రానికి గ్యాస్‌స్టవ్ అందచేత

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు అంగన్వాడి కేంద్రంలో గ్యాస్ స్టవ్‌ను శుక్రవారం పొన్నూరు అర్బన్ సిఐ ఎండి ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఖాన్ అందజేశారు. గత కొన్ని నెలల నుండి గ్యాస్ స్టవ్ లేని విషయం తెలుసుకొని, స్టవ్‌ను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐ హషీమ్ పాల్గొన్నారు .

మట్టి ఖర్చులకు రూ.పదివేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన ఈపూరి జ్ఞానమ్మ (65) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతి వార్త తెలుసుకున్న చిర్రావూరు గ్రామ తెలుగుదేశం నాయకులు తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో రూ.10వేలు జ్ఞానమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం చిర్రావూరు గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, తెలుగుదేశం గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలపాటి రాజా పెన్షన్ అందజేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ఆలపాటి రాజేంద్రప్రసాద్ పెన్షన్ కానుకను అందజేశారు. నియోజకవర్గ పరిధిలో 11వ వార్డు ప్రాంతానికి చెందిన పద్మ, కొలకలూరు, మల్లెపాడు, సోమసుందర పాలెం గ్రామాల్లో రూ 30 వేల ఐదు వందలు ఆర్థికసహాయాన్ని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లవరపు విజయ్ తదితరులు పాల్గున్నారు.

ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య స్పష్టం చేశారు. గుంటూరు నగరంలోని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కార్యాలయంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటైన పొన్నూరు వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే రోశయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గానికి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఈ సందర్భంగా శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టు సోదరులు పలుమార్లు తనను ప్రెస్ క్లబ్ కావాలని కోరిన నేపథ్యంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దయాకర్ మిత్ర బృందం అధ్వర్యంలో విదేశాల్లో ఉన్న తన స్నేహితుడు కళ్యాణ్ చక్రవర్తి తన కుమారుడు వైభవ్ రామ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని రత్నాల చెరువు శ్రామిక వాడలో వద్దులకు చీరలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బత్తెన శ్రీనివాసరావు, నక్క శంకర్, కలపాల బాలు, మేడురి భాస్కర్, బియ్యం శ్రీను, సాయి, మధు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలో ఎంఈఓ కార్యాలయం, వైయస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవన ప్రాంగణాలు అంధకారంలో మగ్గుతున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రక్కనే పార్కు, విద్యుత్ శాఖ కార్యాలయం ఉన్నాయి. పార్కుకు నిత్యం వాకింగ్ చేసేందుకు అనేక మంది వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ కార్యాలయం, అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వద్ద లైట్లను ఏర్పాటు చేస్తే ప్రయోజనంగా ఉంటుందని అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించినట్లవుతుందని కోరుతున్నారు.



ట్యాంకర్ల నుండి నీరు పట్టుకుంటున్న మహిళలు

టిడిపి ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 14వ వార్డు ముగ్గురోడ్డు కాలనీ నివాసితులకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో వాటర్ ట్యాంకర్ ద్వారా శుక్రవారం తాగునీటిని సరఫరా చేయించారు. తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో ముగ్గురోడ్డు కాలానీ నివాసితులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. టిడిపి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న నారా లోకేష్ వెంటనే స్పందించి జలధార పేరుతో మంచినీటి ట్యాంకర్‌ను పంపించి తాగునీటిని సరఫరా చేయించారు. వాటర్ ట్యాంకర్‌ను పంపి తాగునీటిని సరఫరా చేయించిన నారా లోకేష్‌కు ముగ్గురోడ్డు కాలనీ నివాసితులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్‌ను పరిశీలించిన ఎంపీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్ లను రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నగర కమిషనర్ నిర్మల్ కుమార్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, మార్కెట్ యార్డ్ ఛైర్ పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి తదితరులు శుక్రవారం పరిశీలించారు.

మంగళగిరిలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

జయప్రదం చేయాలని సంఘం విస్తృత సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభ మంగళగిరి పట్టణంలో జనవరి 21 తేదీన నిర్వహిస్తామని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా హేమ సుందరరావు తెలిపారు. శుక్రవారం మహాసభ ఆహ్వాన కమిటీ సమావేశం మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు చేనేత కేంద్రమైన మంగళగిరిలో రాష్ట్ర మహాసభకు అన్ని జిల్లా మండల, కేంద్రాలనుంచి చేనేత నాయకులు కార్మికులు అధిక సంఖ్యలో, అనుబంధ సంఘ నాయకులు పాల్గొని మంగళగిరిలో జరుగు ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జెవి సత్యన్నారాయణ మూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి -పెదనందిపాడు

ఆధునిక వ్యవసాయ పద్ధతులతోనే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చుని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు షేక్ అర్షియా, కే.అఖిల భారతి, ఎం కావ్య లిఖిత, వి అంజలి అన్నారు. శనివారం పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. వరగాని గ్రామంలో పండే పంటలు వాటికి చేపట్టే సస్యరక్షణ చర్యలు గురించి తెలిపారు. రైతులు పంటల సాగులో తెగుళ్ల నివారణకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పంట సాగులో తెగుళ్లను నివారిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువగా దిగుబడులను సాధించవచ్చని వివరించారు. రైతులు పొలంలో విత్తనాలు విత్తే సమయంలో విత్తన శుద్ధి చేయటంతో పంటకు చీడపీడలు ఆశించవని తెలిపారు. రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను వినియోగిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రైతులకు వ్యవసాయం ఆర్థిక భారం కాకుండా అధిక దిగుబడులు సాధించి లాభాలు వస్తాయన్నారు. వరగాని గ్రామ పటాన్ని చక్కటి రంగులతో ముగ్గులు వేశారు. బాపట్ల వ్యవసాయ విద్యార్థులు చేస్తున్న వ్యవసాయ కార్యక్రమాలపై రైతులు, గ్రామస్తులు, వ్యవసాయ అధికారులు, రైతు భరోసా సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రశంసించారు.



వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా శుక్రవారం స్థానిక డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం నుండి ఉమెన్స్ కాలేజి వరకూ నిర్వహించిన ర్యాలీని స్టెప్ సిఇఒ పల్లవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన వారి పట్ల వివక్షత చూపరాదని కోరారు. ఈ సందర్భంగా హెచ్ఐవి సోకిన పిల్లలకు మందులు వాడే విధానాన్ని తెలిపే గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం హెచ్ఐవి నివారణ అందరి కర్తవ్యమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసులు, ఐసిడిసి సూపర్‌వైజర్ జె.వీరాస్వామి, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న స్టెప్ సిఇఒ, డిఎం అండ్‌హెచ్ఒ

ప్రజాశక్తి-తెనాలిరూరల్: స్థానిక ఎ ఎస్ ఎన్ కళాశాల విద్యార్థులు ఆటోనగర్ లో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ మహమ్మారి పై అవగాహన కలిగిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె వెంకట రమణ, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి గణపతి నగర్ లోని ఇందిరానగర్ డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష ప్రారంభించారు. ఎయిడ్స్ లక్షణాలు కనిపించిన వారు సమీపంలోని ప్రభుత్వ ఆస్పటల్లోని ఐసీటీసీ సెంటర్లలో వైద్య సేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి, ఏ ఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లో ఉద్వికాష్ హ్యాకథాన్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఉద్వికాష్ పేరుతో 24 గంటల హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాలను పరిశ్రమలకు పరిచయం చేయటానికి తమ కళాశాల వేదిక కావటం గర్వకారణం అన్నారు. పలు సాఫ్ట్‌వేర్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, రీసైక్లింగ్ ఇండస్ట్రీలు, వర్క్‌షాప్ వివిధ రకాల కంపెనీలలో యాప్ అండ్ వెబ్ డెవలప్‌మెంట్, మెషిన్ డిజైనింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కెమికల్ అండ్ పాలీమర్, టెక్స్‌టైల్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలు చూపటానికి దేశ వ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఐఐసి చాప్టర్ ఆధ్వర్యంలో ఈ హ్యాకథాన్ పోటీల్లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. నిరంతర వినూత్న ఆలోచనలే అద్భుతాలను సృష్టిస్తాయని, తమకు ఎదురయ్యే ప్రతి సవాళ్లను ఎదుర్కొనటానికి సిద్ధంగా ఉండాలని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కాలేజి డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఐఐసి కన్వీనర్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు



ఫిబ్రవరి 2,3 తేదీల్లో వర్సిటీ

జువాలజీ విభాగంలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగంలో ఇమ్యునాలజీ బయోడైవర్సిటీ ఆక్వా కల్చర్ అండ్ ఆక్వాటిక్ టాక్సికాలజీ అనే అంశంపై వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 3 తేదీలలో యుజిసి జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ కే సునీత తెలిపారు. ఈ మేరకు సదస్సు బ్రోచర్ను శుక్రవారం విసి ప్రొఫెసర్ పి రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు పంపించేవారు జనవరి 10వ తేదీలోగా పంపాలన్నారు.కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

చదువుతోపాటు విషయ విజ్ఞానాన్ని పెంపొందించు కోవటం ద్వారా మేధస్సు చురుకుగా పనిచేస్తుందని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. నవంబర్ 30న వివా ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో భాష్యం గుంటూరు అర్బన్-1 విద్యార్థులు ప్రథమ స్థానం, నర్సరావుపేట జోన్ విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను శుక్రవారం రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో గుంటూరు జెడ్ఇఒలు తలశిల సాంబశివరావు, ప్రిన్సిపల్ పి.కృష్ణ కిషోర్, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

ఆభరణాల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రముఖ జ్యూవెలర్స్ సంస్థ సికెసి ఆధ్వర్యంలో బంగారు, వెండి ఆభరణాల ప్రదర్శన గుంటూరు క్యాపిటల్ హోటల్‌లో శుక్రవారం ప్రారంభం అయింది. ప్రదర్శనను ఎమ్మెల్యే మద్దాలి గిరి సతీమణి పూర్ణిమ, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి సంయుక్తంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు ప్రదర్శన కొనసాగుతుందని ఆదివారం సాయంత్రంతో ముగుస్తుందని సికెసి సంస్థ నిర్వహాకులు తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణిమ, వసంతకుమారి మాట్లాడుతూ మహిళలకు నచ్చే,మెచ్చే ఎన్నో డిజైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సంప్రదాయ, తాజా డిజైన్లు మహిళలను ఆకట్టుకుంటాయన్నారు. చక్రటి వజ్రాలతో పాటు ముత్యాలు, అమెథిస్టు, కెంపులు, అరుదైనరత్నాలతో ఆకర్షించే డిజైన్లు ఉన్నాయని ప్రశంసించారు. ప్రారంభోత్సవంలో సికెసి జ్యూయలర్సు సంస్థ ప్రతినిధులు శ్రీహరి, ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రదర్శనలో మద్దాలి పూర్ణిమ, నంబూరు వసంతకుమారి తదితరులు

వర్సిటీలో జాతీయస్థాయి ఫైన్‌ఆర్ట్స్ ప్రదర్శన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ గ్యాలరీలో జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను విశ్వ విద్యాలయ వీసి ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా యుని వర్సిటీల విద్యార్థులు వేసిన కళాకృతులను పరిశీలించి అభినందించారు. అనంతరం అయన మాట్లాడుతు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ఎంతో వినూత్నంగా విలక్షణమైన ఆలోచనలతో నూతన ఆవిష్కరణ వైపు నడిచేలా ప్రదర్శనలో వారి ప్రతిభను ప్రదర్శించారన్నారు. ఇతర విభాగాలతో పోలిస్తే ఫైన్ ఆర్ట్స్ రంగం ఎంతో ప్రాముఖ్యతను ప్రత్యేకతను సంతరించు కుంటుందని అన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివిధ ఫైన్ ఆర్ట్స్ కళాశాలల నుండి సుమారు వందమంది విద్యార్థులు పాల్గొని 150 కళాఖండాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన వీక్షకులను విశేషంగా ఆకర్షించి ఆలోచింపచేసే విధంగా ఉందని ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూపరాణి అన్నారు. ఈ రెండు రోజులు జరిగే ఈ చిత్ర కళా ప్రదర్శనశనివారం సాయంత్రం సభతో ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో గాన గంధర్వ ఎస్పీ బాల సుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిత, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుబాబు కళాకారులను, కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి. శేఖర్ బాబు, బి. జాన్ రత్న బాబు, పి. శ్రీనివాస్, పి. దేవకాంత్, వరుణ్ మౌర్య, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విసి పి.రాజశేఖర్ తదితరులు





విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన

ఏఎన్యూలో ప్రారంభమైన నేషనల్ ఆర్ట్ ఫెస్టివల్‌లో విద్యార్థులు సందడి చేస్తున్నారు. నచ్చిన పెయింటింగ్స్‌ను తిలకించి అక్కడ సెల్ఫీలు దిగి ఆ పెయింటింగ్ పట్ల వారి వారి అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు పెన్సిల్ తోను మరి కొంతమంది పెయింటింగ్ తోనూ ఇంకొంతమంది క్లాత్ తోను చేసిన కళాకృతులు ఈ ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌లో రికార్డు స్థాయిలో జరిమాన వసూళ్లు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నవంబర్‌లో లక్ష్యానికి మించి టిక్కెట్ చెకింగ్ సిబ్బంది పనిచేసి, రికార్డు నమోదు చేశారని రైల్వే అధికారులు తెలిపారు. డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకరబాబు, సీనియర్ డిసిఎం దినేష్‌కుమార్ ప్రగతి చూపిన సిబ్బందిని అభినందించారు. టిక్కెట్టు లేని, సక్రమంగా ప్రయాణించని వారి నుండి జరిమానాల వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యానికి 54.88 శాతం అధికంగా వసూళ్లు చేశారన్నారు. నవంబర్‌లో రూ.87 లక్షల లక్ష్యం కాగా, రూ.135 కోట్లు వసూలు చేశారన్నారు. నెలవారీ లక్ష్యంతో పోల్చితే నవంబర్‌లో నమోదైన కేసుల సంఖ్య కూడా 67.22 శాతం పెరిగిందన్నారు. మొత్తం జరిమానాలో అత్యధికంగా వసూలు చేసిన టిక్కెట్ తనిఖీ, స్క్వాడ్ సిబ్బంది వై.ఎన్.పద్మారావు, కె.ప్రవీణ్‌కుమార్ సంతోష్‌జా, కె.హేమలత, కెఆర్ఎం రెడ్డి, డి.అశోక్‌ను అధికారులు అభినందించారు. అలాగే మొత్తంగా నవంబర్ నెల వరకూ రూ.6.97 కోట్లు లక్ష్యం కాగా రూ.8.70 కోట్లు అయినట్లు తెలిపారు.



పలు కళాశాలల్లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీలు



ర్యాలీని ప్రారంభిస్తున్న కాలేజి చైర్మన్

హిందూ ఫార్మసీలో

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజి ఫార్మసీ ప్రాక్టీసు విభాగం, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విద్యార్థులు సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై శుక్రవారం కళాశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధు సూదనరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవి కుమార్, ఫార్మా డి.డైరెక్టర్ డాక్టర్ పి.సీతా రామయ్య పాల్గొన్నారు.

చిప్స్ ఆధ్వర్యంలో

ప్రజాశక్తి-గుంటూరు : చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజీలో ఎన్ఎస్ఎస్, ఐపిఎ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో చౌడవరంలోని చంద్రరాజేశ్వరరావు నగర్‌లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర అభినందించారు.



ర్యాలీలో పాల్గొన్న చిప్స్ కళాశాల విద్యార్థులు

మలినేనిలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు : పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిఒచారు. ఈ సదస్సులో డాక్టర్ షమా సుల్తానా ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.



డాక్టర్ షమా సుల్తానాను అభినందిస్తున్న విద్యార్థినులు



క్లెయిమ్‌లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

బిఎల్‌ఓలు తమకు రోజువారీ అందే క్లెయిమ్స్ ఏరోజుకారోజే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పెండింగ్ క్లెయిమ్స్ రెండ్రోజుల్లో పరిష్కరించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏఈఆర్ఓలు, సూపర్వైజరి అధికారులు, బిఎల్‌ఓలతో ఎన్నికల విధులపై, శని, ఆదివారాల్లో జరిగే స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. జనవరి 5న విడుదల అయ్యే తుది ఓటర్ల జాబితాలో ఏవిధమైన తప్పులు లేకుండా చూడడానికి ఇదే చివరి అవకాశమని, బిఎల్‌ఓలు తమకు కేటాయించిన ఓటర్ల లిస్టును భాధ్యతగా తీసుకోవాలన్నారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి, ఏఈఆర్ఓలు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, వెంకట కష్ణయ్య, ప్రదీప్‌కుమార్, కోటయ్య, మాస్టర్ ట్రైనర్లు వై.హరిహరనాద్, శ్రీకాంత్, సూపరిండెంట్లు సాంబశివరావు పాల్గొన్నారు.